క్లుప్తంగా

సమ్మక్క, సారక్క సేవలో ఎమ్మెల్యే బాలరాజు దంపతులు



జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు

బుట్టాయగూడెం: తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా మేడారం సమ్మక్క సారక్కల జాతర మహోత్సవాల్లో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమ్మక్క సారక్కలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా బెల్లాన్ని తలపై పెట్టుకుని అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు మాట్లాడుతూ తాము ప్రతి ఏటా సమ్మక్క, సారక్క జాతర మహోత్సవాల సందర్భంగా తల్లులను దర్శించుకుని పూజలు నిర్వహిస్తామని చెప్పారు. తమ కుటుంబంతో పాటు నియోజకవర్గంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవనం సాగించాలని అమ్మను కోరుకుంటామని తెలిపారు. అలాగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటూ ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆయన గోత్ర నామాలతో పూజలు చేస్తామని తెలిపారు. భక్తుల కోర్కెలు తీర్చే తల్లులుగా సమ్మక్క, సారక్కలకు ఎంతో పేరు ఉందన్నారు. అందుకే జాతర మహోత్సవాల్లో లక్షలాది మంది భక్తులు పాల్గొంటారని చెప్పారు. అలాగే తమకు తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి డి.సీతక్క ఎంతో సహకారం అందించారని ఈ సందర్భంగా ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

'సురక్ష'లో ఆరోగ్యశ్రీ సేవలు



ఎమ్మెల్యే తలారి వెంకట్రావును సత్కరిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: సురక్ష హాస్పిటల్‌లో శుక్రవారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభిస్తుండటం పట్ల గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు హాస్పిటల్ అధినేత కొండముది దిలీప్ కుమార్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. తన నియోజకవర్గానికి చెందిన ఇరువురు వైఎస్సార్ సీపీ శ్రేణులు హాస్పిటల్లో చికిత్స తీసుకుంటున్న నేపథ్యంలో వారిని పరామర్శించడానికి ఆయన విచ్చేశారు. ఏజెన్సీ మెట్ట ప్రాంతంలోని ప్రజలకు మెరుగైన వైద్య చికిత్స అందించడంలో తనకంటూ దిలీప్ కుమార్ ప్రత్యేకత సంతరించుకున్నారన్నారు. ఈ సందర్భంగా శ్యామల, దిలీప్ కుమార్ దంపతులు ఎమ్మెల్యేను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ సచివాలయాల కన్వీనర్ నూకల రాము, పార్టీ నాయకులు మారిశెట్టి శ్రీను, చిటికెన నాగార్జున, కొనకళ్ళ రాము, ఆర్యవైశ్య సంఘం నాయకుడు సొలస సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

పోలవరం రూరల్: పోలవరం మండలంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి శుక్రవారం పరిశీలించారు. మండలంలోని ఆర్.నాగంపాలెం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా వసతులు ఏ విధంగా ఉన్నాయనే విషయాలను తెలుసుకున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్పీ వెంట డీఎస్పీ ఎస్.సురేష్‌కుమార్ రెడ్డి, సీఐ జి.మధుబాబు, ఎస్బీ సీఐ మల్లేశ్వరరావు, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ ఉన్నారు.

గండ దీపాలతో మొక్కుబడి

కామవరపుకోట: స్థానిక కోటలో కొలువైన శ్రీ వీరభద్ర స్వామి కళ్యాణ మహోత్సవంలో భాగంగా శుక్రవారం గ్రామ బలిహరణ గండ దీపాల కార్యక్రమం ప్రధాన అర్చక స్వాములతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏడాది కోర్కెలు తీరిన వేలాది మంది భక్తులు సుదూర ప్రాంతాల నుంచి మొక్కుబడులు చెల్లించడానికి స్వామివారి కళ్యాణం రోజు ఇక్కడికి వస్తుంటారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్థానిక తేలిల సంఘ ఆధ్వర్యంలో వీరంగం నృత్య నాట్యాలు, నారసములు నిర్వహించారు

గ్యాస్ స్టౌ వితరణ

కుక్కునూరు: మండలంలోని కివ్వాక ప్రభుత్వ పాఠశాలలో గ్యాస్ స్టౌ పాడవ్వడంతో శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకుడు బట్టు వీరబాబు పాఠశాలకు కొత్త గ్యాస్ స్టౌను అందించారు. కివ్వాక ఎంపీయూపీఎస్ పాఠశాల నందు కొన్ని రోజుల క్రితం గ్యాస్ స్టౌ మరమ్మతులకు గురై వంట వండేందుకు మధ్యాహ్న భోజన సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని వీరబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన కొత్త గ్యాస్ స్టౌను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, నాయకులు నాచుపల్లి నాగరాజు, మేడబలిమి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతన్న నేస్తాలు ఆర్బీకేలు

- గ్రామ స్థాయిలో రైతుల చెంతకే సేవలు
- ఎరువులు, విత్తనాల పంపిణీ
- పంటల సాగుపై సలహాలు, సూచనలు
- గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీపై విత్తనాల పంపిణీ
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



బుట్టాయగూడెం ఆర్బీకేలో రైతులకు యంత్ర పనిముట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)



ముప్పినవారిగూడెం ఆర్బీకేలో రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)



విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం (ఫైల్)



వ్యవసాయ భూమిలో మట్టి నమూనా సేకరిస్తున్న ఆర్బీకే సిబ్బంది



బుట్టాయగూడెం: గత ప్రభుత్వం వ్యవసాయం దండగ అని అంది. వ్యవసాయం చేయాలంటే రైతులు విత్తనాలు, ఎరువుల కోసం నానా అవస్థలు పడేవారు. పెట్టుబడులు లేక అప్పు చేసి మరీ పంటలు సాగు చేసేవారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక తీవ్రమైన నష్టాలను ఎదుర్కొనేవారు. పంటలకు గిట్టుబాటు ధర లభించక రైతు కుటుంబాలు పడుతున్న బాధలు వర్ణనాతీతంగా ఉండేవి. రైతులు అప్పుల ఊబిలో కొట్టుమిటాడుతూ జీవనం సాగించేవారు. అయితే ఇదంతా గతం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో రైతుల కష్టాలను స్వయంగా తెలుకుని నేను ఉన్నాను.. నేను విన్నాను అని రైతులకు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయాన్ని పండుగలా మార్చారు. అన్నదాతలకు ప్రభుత్వం కొండంత అండగా నిలిచింది. ఉత్పత్తుల నుంచి పంటలు కొనుగోలు చేసే వరకూ సహాయం చేస్తూ రైతులకు ఎటువంటి కష్టం రాకుండా అండగా నిలుస్తోంది. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల చెంతకే అన్ని సేవలను అందిస్తూ అన్నదాతలకు కష్టం కలుగకుండా రైతు కుటుంబాలు సుఖసంతోషాలతో జీవనం సాగించేలా ప్రభుత్వం కృషి చేస్తోంది. దీనితో ప్రభుత్వం అందిస్తున్న సేవల పట్ల వ్యవసాయానికి అందిస్తున్న తోడ్పాటుతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్బీకేలోనే విత్తనాలు, ఎరువుల పంపిణీ

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు రైతులకు మేలు చేస్తున్నాయి. ఆర్బీకేల ద్వారా ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తోంది. ఎరువులు, విత్తనాలు ఈ కేంద్రాల ద్వారానే అందించడం జరుగుతోంది. దీనితో ఎరువుల కోసం దూరాభారంగా ప్రయాణం చెయ్యాల్సిన కష్టం రైతులకు తగ్గింది. ఆర్బీకేల్లో పంటలను కొనుగోలు చేయడం వల్ల రైతులకు దళారుల బెడద తప్పింది. అలాగే గిరిజన ప్రాంతంలో 90 శాతం సబ్సిడీపై గిరిజనులకు విత్తనాలు, ఎరువులను ఇవ్వడం జరుగుతోంది. అలాగే వ్యవసాయ పనిముట్లతో పాటు ట్రాక్టర్‌లు కూడా అందజేస్తున్నారు.

కియోస్కో యంత్రంతో ఎన్నో ప్రయోజనాలు

రైతు భరోసా కేంద్రాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కియోస్కో యంత్రాల ద్వారా రైతులకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. రైతులకు కావాల్సిన అన్ని రకాల సబ్సిడీ ఎరువులు, విత్తనాలు రైతులకు 48 గంటల్లోనే నేరుగా అందుతున్నాయి.

ఈ–క్రాప్ బుక్కింగ్, పంట నష్టపరిహారం

ప్రతి రైతు తాను సాగు చేస్తున్న పంటలకు సంబంధించి ఈ–క్రాప్ బుక్కింగ్ చేసుకుంటున్నారు. తద్వారా విపత్తులు, తుఫానుల వల్ల పంట నష్టం వాటిల్లితే ప్రభుత్వం నుంచి వచ్చే నష్టపరిహారం పొందే అవకాశం ఉంది. రైతులకు పంట రుణాలను కూడా అందజేస్తున్నారు.

గడిచిన నాలుగేళ్లుగా..

గడిచిన నాలుగేళ్లుగా పోలవరం నియోజకవర్గంలోని 7 మండలాల పరిధిలో ఉన్న 107 ఆర్బీకేల ద్వారా 41,584 మంది రైతులు ఉండగా వీరికి రైతు భరోసా, పీఎం కిసాన్ పథకం ద్వారా రైతుల బ్యాంక్ ఖాతాల్లో సుమారు రూ.32.03 కోట్లు జమ చేయడం జరిగింది. అదేవిధంగా 99 మంది రైతులకు రూ.134 లక్షలతో యంత్రాలు, పనిముట్లను పంపిణీ చేశారు.

పోలవరం నియోజకవర్గం
మండలాలు – 7
రైతు భరోసా కేంద్రాలు – 107
రైతుల సంఖ్య – 41,584
రైతుభరోసా, పీఎం కిసాన్ ద్వారా పొందిన లబ్ధి – రూ.32.03 కోట్లు
వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు పొందిన రైతులు – 199
రైతులు పొందిన లబ్ధి – రూ.50.26 లక్షలు
ఎరువులు , విత్తనాలు అందుకున్న రైతులు సంఖ్య – 1,119
90 శాతం సబ్సిడీపై గిరిజన రైతులు పొందిన లబ్ధి – రూ.27.23 లక్షలు
50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పొందిన రైతులు – 1,563
పొందిన లబ్ధి – రూ.16.91 లక్షలు

ఆర్బీకేలతో మేలు



గతంలో పంటలకు విత్తనాలు, ఎరువులు కొనుగోలు కోసం మండల కేంద్రానికి పరుగులు తీసేవారం. అలాగే దళారుల చేతిలో మోసపోయేవారం. గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా మాకు రాయితీపై ఎరువులు, విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. ఇక్కడ వ్యవసాయ యంత్రాలను కూడా అందిస్తున్నారు. ఆర్బీకేల వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

– కలగర నాని, రైతు, కొమ్ముగూడెం, బుట్టాయగూడెం మండలం

రైతులకు ఇబ్బందులు, కష్టాలు తొలగాయి



గతంలో విత్తనాలు, ఎరువుల కోసం వేర్వేరు ప్రాంతాలకు వెళ్ళే వాళ్లం. ఒక రోజంతా సమయం పట్టేది. నాణ్యమైన సరుకులు దొరికేవి కావు. పైపెచ్చు రవాణా ఖర్చులు కూడా ఎక్కువయ్యేవి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రంలో రైతుల చెంతకే సేవలు అందుతున్నాయి. చాలా సంతోషంగా ఉంది.

– ధర్ముల బాబూరావు, రైతు, సీతప్పగూడెం, బుట్టాయగూడెం మండలం

ఆర్బీకేల ద్వారా నూరు శాతం రైతులకు సేవలు



ఆర్బీకేల ద్వారా రైతులకు నూరుశాతం సేవలు అందిస్తున్నాం. రైతులకు రాయితీపై విత్తనాలు, ఎరువులు పంపిణీ చేస్తున్నాం. అలాగే పంటల సాగుపై రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నాం.

– బి. సుమలత,
వ్యవసాయాధికారిణి, బుట్టాయగూడెం మండలం

రైతులకు అండగా ప్రభుత్వం



లింగపాలెంలో రైతులకు బోరు మోటార్లను పంపిణీ చేస్తున్న విజయరాజు, పార్టీ నాయకులు

లింగపాలెం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని పార్టీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు అన్నారు. వైఎస్ఆర్ జలకళ పథకం కింద మంజూరైన ఉచిత బోరు మోటార్లను శుక్రవారం లింగపాలెం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో విజయరాజు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు చేతుల మీదుగా 23 మంది రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని రైతులకు ఎంతగానో మేలు చేస్తున్నారన్నారు. లింగపాలెం మండలంలో మొత్త 23 మంది రైతలకు ప్రభుత్వం రూ.27 లక్షల 60 వేలు విలువ గల బోరు మోటార్లను ఉచితంగా అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, మండలాధ్యక్షుడు కొఠారి మోహన్, నాయకులు ఇనుగంటి సతీష్, పానుగంటి రాము, బి.ప్రభాకర రెడ్డి, పి.వేమనరెడ్డి, ఏపీవో జి.వరలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి



ఆరోగ్య సురక్ష కార్డులు అందజేస్తున్న దృశ్యం

చింతలపూడి: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని మండల పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ బి.రాంబాబు నాయక్ అన్నారు. మండలంలోని యర్రగుంటపల్లి సచివాలయం 1లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష వైద్య శిబిరాలకు ప్రజలు హాజరై పరీక్షలు చేయించుకోవాలని ఎంపీపీ సూచించారు. నిపుణులైన వైద్యులు గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తుల్లిమిల్లి రాణి, ఎంపీడీవో చిన్న రాట్నాలు, వైద్యారోగ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ల వ్యవస్థతో సుపరిపాలన

హోం మంత్రి తానేటి వనిత



గొల్లగూడెంలో వలంటీర్లను సత్కరించిన రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత

ద్వారకాతిరుమల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా వలంటీర్ల వ్యవస్థతో రాష్ట్రంలో సుపరిపాలనను అందిస్తున్నారని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని గొల్లగూడెంలో శుక్రవారం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి వనిత ముందుగా మండలంలోని 405 మంది వలంటీర్లలో సేవారత్న అవార్డుకు ఎంపికైన 5 గురికి, ఒక్కొక్కరికి రూ.30 వేలు, మిగిలిన 400 మందికి ఒక్కొక్కరికి సేవామిత్ర అవార్డు కింద రూ.15 వేలను అందించారు. అలాగే వారిని ఘనంగా సత్కరించి, ప్రశంసాపత్రాలతో పాటు, మెడల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందజేయాలనే సంకల్పంతో సచివాలయ వ్యవస్థకు వలంటీర్లను అనుసంధానం చేశారన్నారు. ఈ వ్యవస్థలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శం కావడం గొప్ప విషయమన్నారు. వలంటీర్ల వ్యవస్థతో జగనన్న పాలనకు మంచి పేరు వస్తోందని, దాన్ని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ వ్యవస్థపై వ్యతిరేకత తీసుకొచ్చేందుకు వారు చేసిన కుట్రలు ఫలించలేదని తెలిపారు. గత చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీల పెత్తనంతో అర్హులకు సంక్షేమ పథకాలు అందక అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని, అందుకు వలంటీర్ వ్యవస్థే కారణమన్నారు. సేవే లక్ష్యంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్న వలంటీర్లు జనం మెచ్చిన నిజమైన సేవకులని ఆమె కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గారపాటి రామప్రభ, మండల మహిళా అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి, దాకారపు బంగారమ్మ, బొండాడ వెంకన్నబాబు, ఆచంట బన్ను, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, వసుపులేటి ఏసుబాబు, భోగరాజు సాయి కృష్ణ, కుంటం స్వర్ణలత, జంగా వెంకట కృష్ణారెడ్డి, గుర్రాల లక్ష్మణ్, మానుకొండ సుబ్బారావు, దాసరి ఏసురత్నం, ఉక్కుర్తి వెంకట్రావు, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, అల్లాడ హరే రామకృష్ణ, పెండ్యాల విజయ్, నున్న పద్మ, కొప్పిశెట్టి గంగ, లక్కాబత్తుల సిద్ధిరాజు, మనెల్లి మణి, జిత్తుక శ్రీను, చిట్టిబొమ్మ ప్రసాద్, చెరుకూరి ప్రసాదరావు, పల్లి నిర్మల, ఆకుర్తి సత్యనారాయణ, మిడతా చందు, ప్రభాకరరావు, అద్దంకి తిరుపతిరావు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు



లింగపాలెంలో వలంటీర్లను సన్మానిస్తున్న కంభం విజయరాజు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు

లింగపాలెం: వలంటీర్ల సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు అన్నారు. శుక్రవారం లింగపాలెం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గ్రామ వలంటీర్లకు పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ సచివాలయ వ్యవస్థకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. ప్రజాసేవే పరమావధిగా వలంటీర్ల వ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తూ ప్రజలందరి మన్ననలు పొందడం విశేషమన్నారు. ప్రజల ముంగిటకే పథకాలు అందిస్తూ అవినీతి రహిత, పారదర్శకంగా పనిచేస్తున్నారన్నారు. వలంటీర్ల వ్యవస్థపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి నమ్మకాన్ని పెట్టుకున్నారని, జగనన్న మీకు ఎల్లప్పుడూ అండగా ఉంటారని వలంటీర్లకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబా, మండల వైస్ ఎంపీపీ మట్టా సురేష్, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కొఠారి మోహన్, పార్టీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, రంగాపురం సొసైటీ చైర్మన్ రెడ్డిన శ్రీను, సర్పంచులు తగరం హేమలత, పి.ప్రసాద్, నాయకులు రావి కొండయ్య, ఇనుగంటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వైఎస్సార్ సీపీ విజయం ఖాయం



మాట్లాడుతున్న హోం మంత్రి వనిత

ద్వారకాతిరుమల: దేశ రాజకీయాల్లో ఇప్పటి వరకు మేలు జరిగితేనే తమ పార్టీకి ఓటేయమని ప్రజలను కోరిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. ప్రతిపక్షాలన్నీ ఏకమై, ఎన్ని కుట్రలు చేసినా ప్రజల ఆశీర్వాదంతో 2024 ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీ విజయం సాధించడం ఖాయమని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని రాజుపాలెం, పావులూరివారిగూడెం, తిరుమలంపాలెం, మత్తేవారిగూడెం, ఎం.నాగులపల్లి, ద్వారకానగర్, గొల్లగూడెం గ్రామాల్లో శుక్రవారం విస్తృతంగా పర్యటించిన ఆమె ఆయా గ్రామాల్లో పార్టీ నేతలతో కలిసి సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలంపాలెంలో ఆమె దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న తమ ప్రభుత్వానికి మాత్రమే ఓటడిగే హక్కు ఉందన్నారు. వివక్షకు తావు లేకుండా, అవినీతి రహిత పాలనను జగనన్న సాగిస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ప్రజలను దోచుకున్నాయని విమర్శించారు. ఆ కమిటీలు గంజాయి మొక్కలైతే.. సచివాలయాలు తులసి మొక్కలన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పేదలకు సేవ చేయడానికే పుట్టిందన్నారు. ప్రతిపక్షాలు అన్నీ ఏకమైనా జగనన్న సింహంలా, సింగిల్‌గా పోరాటానికి సిద్ధం అంటున్నారని అన్నారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో 25 లక్షల ఇళ్లు ఇస్తానని చెప్పి, ఇప్పటి వరకు 32 లక్షల ఇళ్లు ఇచ్చిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. 99 శాతం హామీలను నెరవేర్చి, ఇవ్వని హామీలను కూడా నెరవేర్చారని అన్నారు. పేదలకు అభివృద్ధి, సంక్షేమాన్ని అందిస్తున్న జననేత రుణం తీర్చుకునే సమయం వచ్చిందని, ప్రతి ఒక్కరూ ఆయనకు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. పసుపు, కుంకుమ అంటూ మళ్లీ ఓట్లు కోసం ఎవరైనా వస్తే వారిని పట్టించుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని, వైస్ ఎంపీపీ ఓగిరాల చంద్ర, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గారపాటి రామప్రభ, మండల మహిళా అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి, పల్లి నిర్మల ప్రసాద్, ఆకుర్తి సత్యనారాయణ, భోగరాజు సాయికృష్ణ, మిడతా చందు గౌడ్, ప్రభాకరరావు, అద్దంకి తిరుపతిరావు, వెలిగట్ల ఫణి కుమార్, వెంకటేష్, ఎలమర్తి సత్యనారాయణ, బొప్పన చిన్న, బోయపాటి మోహన్‌రావు, యంత్రపాటి సునీల్, నల్లూరి బాపనయ్య, నల్లూరి వెంకన్నబాబు, ఎలమర్తి సీతారామయ్య, తూంపాటి భీమేశ్వరరావు, కట్టా వెంకట్రావు, చిలకా ఇజ్రాయెల్, పడమటి ఏసు, దాకారపు బంగారమ్మ, బొండాడ వెంకన్నబాబు, ఆచంట బన్ను, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, కుంటం స్వర్ణలత, జేవీకే రెడ్డి, గుర్రాల లక్ష్మణ్, మానుకొండ సుబ్బారావు, దాసరి ఏసురత్నం, ఉక్కుర్తి వెంకట్రావు, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, అల్లాడ హరే రామకృష్ణ, పెండ్యాల విజయ్, నున్న పద్మ, కొప్పిశెట్టి గంగ, లక్కాబత్తుల సిద్ధిరాజు, మనెల్లి మణి, జిత్తుక శ్రీను, చిట్టిబొమ్మ ప్రసాద్, చెరుకూరి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

సంత్ గాడ్గే బాబా జయంతి

జంగారెడ్డిగూడెం: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సమాఖ్య ఆధ్వర్యాన సంత్ గాడ్గే బాబా జయంతిని జంగారెడ్డిగూడెంలో శుక్రవారం నిర్వహించారు. డాక్టర్ కోట సుబ్బారావు ఆసుపత్రి నందు నిర్వహించిన కార్యక్రమంలో బీసీ నాయకులు ఆర్‌జేఎస్ఎస్ వెంకటేశ్వరరావు. ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గాడ్గే బాబా సేవలను కొనియాడారు. బి.రామారావు, ఎం.శ్యామ్‌బాబు, కేవీఎల్ ప్రభాకర్, రాష్ట్ర గౌడ సంఘ కార్యదర్శి దాసరి శ్యాంసుందర్ శేషు, నాగేశ్వరరావు, మానికల వెంకటేశ్వరరావు, భీమన్న, విసంపల్లి సిద్ధుమాదిగ, ఎం.నాగరాజు, కావేటి నాగు, ఘంటా అప్పారావు, ఎంఎస్, ఇన్వర్టర్ నాగు తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రయంపై కేసు

టి.నరసాపురం: సారా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వి.జయకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. టి.నరసాపురం పంచాయతీ మెట్టగూడెంలో సారా విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు తన సిబ్బందితో శుక్రవారం దాడి చేయగా తెల్ల టిన్నులో సారా విక్రయిస్తున్న వ్యక్తి పోలీసులను చూసి పారిపోయాడు. వ్యక్తి వదిలిన 9 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.